సాక్షి కామారెడ్డి

బుధవారం। 10। మే। 2023



కొనుగోలు కేంద్రాల్లోనే..

రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించడం ద్వారా మద్దతు ధర లభిస్తుందని అధికారులు సూచించారు.

- 9లో ▸



రాష్ట్రంపై కేంద్రం కక్ష

కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయాల్సిన నిధులు ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వంపై కక్ష కట్టిందని ఎమ్మెల్యే హన్మంత్‌సింధే అన్నారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
38.4 /28.7

వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. సాయంత్రం ఆకాశం మేఘావృతమవుతుంది. ఈదురు గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



కామారెడ్డి క్రైం: జిల్లాలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కామారెడ్డి పట్టణంలోని సాందీపని జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. కంటి వెలుగు కేంద్రంలో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలు ఉచితంగా అందజేయాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉపవైద్యాధికారి చంద్రశేఖర్, కౌన్సిలర్ వనిత, వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ పరీక్షల అక్రమాలపై ఏసీబీకి ఫిర్యాదు



కామారెడ్డి టౌన్: జిల్లాలో ఇటీవల జరిగిన ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల్లో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయని తక్షణమే విచారణ జరపాలని.. అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కామారెడ్డి విద్యార్థి సంఘాల నాయకులు మంగళవారం నిజామాబాద్‌లోని ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఓపెన్ పరీక్షల్లో అధికారులే దగ్గరుండి విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేసుకుని మాస్ కాపీయింగ్‌కు పాల్పడ్డారని తెలిపారు. యూపీఐ ఆన్‌లైన్ ద్వారా విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేసి అందరు కలిసి పంచుకున్నారని పేర్కొన్నారు. పరీక్షల్లో ఒకరికి బదులుగా మరొకరు పరీక్ష రాస్తుండగా రాష్ట్ర అబ్జర్వర్ పట్టుకున్నారని వివరించారు. ఒక్కో విద్యార్థి నుంచి రూ. 10వేల నుంచి రూ. 20వేల వరకు వసూలు చేశారన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు ఐరెని సందీప్, ముదాం అరుణ్, విఠల్, సురేష్, నాగరాజు, ప్రవీణ్‌లు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలి

పిట్లం: ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని డీఆర్‌డీవో సాయన్న సిబ్బందికి సూచించారు. మండలంలోని రాంపూర్, జగదాంబతండా, చిల్లర్గిల్లో ఉపాధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో బ్రహ్మం, ఏపీవో శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలదే హవా!

స్ఫూర్తికి స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు



సివిల్ ఇంజినీర్ అవుతా..

- వి.స్ఫూర్తి, ఎంపీసీ 466 మార్కులు, రాష్ట్ర స్థాయి 3వ ర్యాంకు

కామారెడ్డి పట్టణానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన గంగాధర్, జాహ్నవిల కూతురు స్ఫూర్తి. తండ్రి వ్యవసాయం చేస్తుండగా, తల్లి గృహిణి. స్ఫూర్తి సాందీపని కళాశాలలో ఫస్టియర్ చదువుతోంది. ఇంటర్ ఎంపీసీ ఫస్టియర్‌లో 470 మార్కులకు గాను 466 సాధించి రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంక్‌లో నిలిచింది. పేదరిక కుటుంబం అయినా కష్టపడి చదివింది. సివిల్ ఇంజినీర్ అవడమే లక్ష్యమని తెలిపింది.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవుతా

- సుప్రితా గౌడ్ ఎంపీసీ 466 మార్కులు, రాష్ట్ర స్థాయి 3వ ర్యాంకు

కామారెడ్డి పట్టణానికి చెందిన నాగరాజుగౌడ్, మమతల కూతురు సుప్రితాగౌడ్, తండ్రి బిజినెస్ చేస్తుంటాడు. సాందీపని కళాశాలలో ఫస్టియర్ చదువుతోంది. చదువును కష్టంగా కాకుండా ఇష్టంగా చదివానని సుప్రితా తెలిపింది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవ్వడమే లక్ష్యం పెట్టుకున్నట్లు తెలిపింది.



సుప్రితకు స్వీట్ తినిపిస్తున్న తల్లి

- ఇంటర్ ఫలితాల్లో జిల్లాకు 13వ స్థానం
- ఫస్టియర్‌లో 50 శాతం, సెకండియర్‌లో 67శాతం ఉత్తీర్ణత
- రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులు

కామారెడ్డి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం, ఇంటర్మీయట్ బోర్డు మంగళవారం విడుదల చేసిన ఇంటర్ ఫలితాల్లో జిల్లాకు రాష్ట్రంలో 13వ స్థానం దక్కింది. ప్రతియేడు లాగే ఫలితాల్లో ఈ సారి కూడా బాలికల హవా కొనసాగింది. ఇంటర్ ఫస్టియర్‌లో 50శాతం, సెకండియర్‌లో 67శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్ర స్థాయిలో పలువురు విద్యార్థులు ర్యాంకులు సాధించారు. ఇదిలా ఉండగా ఇంటర్ పరీక్షలు మార్చి 15 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు నిర్వహించిన విషయం తెలిసిందే.

ఫస్టియర్ ఫలితాలు ఇలా..

జిల్లాలో ఇంటర్ ఫస్టియర్‌లో 8,262 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వీరిలో 4,146 ఉత్తీర్ణత సాధించారు. 50 శాతం ఉత్తీర్ణత నమోదైంది. వీరిలో బాలురు 4,143కు గాను 1,812 విద్యార్థులు పాసవగా ఉత్తీర్ణత 43 శాతం నమోదైంది. అలాగే 4,119 మంది బాలికలు పరీక్షలు రాయగా 2,334 ఉత్తీర్ణులయ్యారు. 56 శాతం ఉత్తీర్ణత నమోదైంది. వొకేషనల్‌లో 1,261 విద్యార్థులకు గాను 699 మంది పాసవ్వగా సాధించగా, 55శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో బాలురు 601 మందిలో 244 మంది ఉత్తీర్ణత సాధించగా, బాలికల్లో 660 మందికి 455 మంది విద్యార్థినులు ఉత్తీర్ణులయ్యారు.

గతేడాదితో పోలిస్తే ఫలితాలు మెరుగు

గతేడాది ఇంటర్ ఫలితాల్లో జిల్లాకు 22 స్థానం దక్కింది. ఇంటర్ ఫస్టియర్‌లో 62 శాతం ఉత్తీర్ణత కాగా, సెకండియర్‌లో 64శాతం ఉత్తీర్ణత సాధించారు. గతేడాది కంటే ఈ యేడు ఫస్టియర్‌లో ఫలితాలు తగ్గినా, సెకండియర్‌లో మెరుగయ్యాయి.

సెకండియర్ ఫలితాలు ఇలా..

సెకండియర్‌లో 7,543 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 5,064 మంది ఉత్తీర్ణత సాధించారు. 67శాతం ఉత్తీర్ణత నమోదైంది. వీరిలో బాలురు 3,729 మందికి గాను 2,277 మంది పాసవగా ఉత్తీర్ణత 61శాతం నమోదైంది. బాలికలు 3,814 మందిలో 2,787 మంది ఉత్తీర్ణత సాధించారు. 73శాతం ఉత్తీర్ణత నమోదైంది. వొకేషనల్‌లో 1,003 మందికి గాను 676 మందితో 67 శాతం ఉత్తీర్ణత సాధించారు. వీరిలో బాలురు 501 మందికి 238 ఉత్తీర్ణత సాధించగా, బాలికల్లో 502 మందికి గాను 438మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే జనరల్ ప్రైవేటు విద్యార్థులు 310 మందికి 80 మంది ఉత్తీర్ణత సాధించారు. వొకేషనల్‌లో 185 మందికి గాను 90మంది ఉత్తీర్ణులయ్యారు.

సివిల్ ఇంజినీర్ కావడమే లక్ష్యం

- జహంగీర్, ఎంపీసీ సెకండియర్, 989 మార్కులు, రాష్ట్రస్థాయి 5వ ర్యాంకు



జహంగీర్

బీబీపేటకు చెందిన జహంగీర్‌ది వ్యవసాయ కుటుంబం. తండ్రి ఎండీ ఖలీం, తల్లి సల్మాబేగం. సాందీపని కళాశాల విద్యార్థి. రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంకు సాధించడం గర్వంగా ఉందని తెలిపాడు. సివిల్ ఇంజినీర్ కావడమే లక్ష్యమని తెలిపాడు. తన తల్లిదండ్రులు కష్టపడి చదివించారని వారి రుణం తీర్చుకుంటానంటున్నాడు.

నాన్న కలలు నెరవేరుస్తా

- ఉమ్మమహవిన్ 994 ఎంపీసీ, భారత రత్న కళాశాల, బాన్సువాడ



ఉమ్మమహవిన్

బాన్సువాడ: ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు రావడం ఆనందంగా ఉంది. చిన్నప్పటి నుంచి నాన్న చెప్పినట్లు కష్టపడి చదవడంతోనే ఇన్ని మార్కులు రావడానికి దోహదపడింది. నాన్న ప్రైవేటు కళాశాలలో అధ్యాపకులు. డాక్టర్ కావాలనేది నా కోరిక. నాన్న కన్న కలలను నేరవేరుస్తా.

జనరల్ ఫిజీషియన్ అవుతా..

- కె.నవీనా, బైపీసీ 991మార్కులు, రాష్ట్ర స్థాయి 4వ ర్యాంకు



నవీనా

సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌కు చెందిన మొర్రాయిపల్లికి చెందిన రాజం, ఎల్లవ్వ దంపతుల కూతురు నవీనా. వారిది వ్యవసాయ కుటుంబం. తండ్రి వ్యవసాయం చేసుకుంటూ కూతురు చదివించాడు. తన తల్లి దండ్రులు చిన్ననాటి నుంచి కష్టపడుతూ తనను చదివించారని వారి ఆశయాలను తీరుస్తానని నవీనా తెలిపింది. డాక్టర్ కావడమే లక్ష్యంగా పెట్టుకున్నానని తెలిపింది. ఇందుకోసం కష్టపడతానని పేర్కొంది. జనరల్ ఫిజీషియన్ అవుతానని చెప్పింది.

ఇంజినీర్ కావాలనుకుంటున్నా..

- కొటికె సిద్ధార్థ, 988 ఎంపీసీ, రాష్ట్రస్థాయి 8వ ర్యాంకు



కొటికె సిద్ధార్థ

నాగిరెడ్డిపేట: నాగిరెడ్డిపేట మండలంలోని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన కొటికె సిద్ధార్థ అనే విద్యార్థి ఇంటర్ ఫలితాలలో ప్రతిభ చాటాడు. విద్యార్థి తండ్రి సత్యనారాయణ వ్యాపారస్తుడు. సిద్ధార్థ హైదరాబాద్‌లోని శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. ఎంపీసీలో 988 మార్కులు తెచ్చుకొని రాష్ట్రస్థాయిలో ఎనిమిదో ర్యాంకు సాధించాడు. ఐఐటీలో సీటు సంపాదించి ఇంజినీర్ కావడమే నా లక్ష్యమని తెలిపాడు.

వెనక్కి తగ్గని కార్యదర్శులు!



కామారెడ్డిలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్యదర్శులు

- సమ్మెను విరమించేది లేదని స్పష్టీకరణ
- ముగిసిన సర్కారు డెడ్‌లైన్
- జిల్లాలో 442 మంది కార్యదర్శులు

సాక్షి, కామారెడ్డి: ఉద్యోగాల క్రమబద్ధీకరణ కోసం సమ్మెకు దిగిన పంచాయతీ కార్యదర్శులు తమ పోరాటాన్ని కొనసాగించేందుకే సిద్ధమయ్యారు. సమ్మె విరమించాలని రాష్ట్ర ప్రభుత్వం విధించిన డెడ్‌లైన్ మంగళవారం సాయంత్రం 5 గంటలతో ముగిసింది. అయినా ప్రభుత్వ హెచ్చరికలకు కార్యదర్శులు భయపడకుండా ఉద్యోగాలను క్రమబద్ధీకరించే వరకు ఉద్యమం కొనసాగిస్తామని ప్రకటించారు. జిల్లాలో 526 పంచాయతీలుండగా, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు 395 మంది, అవుట్ సోర్సింగ్ పంచాయతీ సెక్రెటరీలు 47 మంది పని చేస్తున్నారు. జేపీఎస్‌లతో పాటు ఓపీఎస్‌లు గత నెల 28 నుంచి సమ్మెలో ఉన్నారు. ప్రభుత్వం ఉద్యోగ నియామకాల సందర్భంలో మూడేళ్లకే రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చింది. తర్వాత మరో ఏడాది పాటు పొడిగించింది. నాలుగేళ్లు గడిచినా రెగ్యులరైజ్ చేయకుండా పట్టించుకోకపోవడంపై కార్యర్శులు సమ్మెబాట పట్టారు. అయితే ప్రభుత్వం కార్యదర్శులతో చర్చలు జరపకపోగా, విధుల్లో చేరకుంటే ఉద్యోగాలు ఊడతాయంటూ డెడ్‌లైన్ విధించింది. ప్రభుత్వం విధించిన డెడ్‌లైన్ మంగళవారం సాయంత్రం ముగిసింది. అయితే రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శులు సమ్మెలో కొనసాగుతామని ప్రకటించారు. ప్రభుత్వం ఏం చేసినా వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. కార్యదర్శులకు కాంగ్రెస్, బీజేపీలు అండగా నిలిచాయి. వారి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నాయి. దీంతో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. అయితే ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం తమను రెగ్యులరైజేషన్ చేయాలని పంచాయతీ కార్యదర్శులు డిమాండ్ చేస్తున్నారు. పంచాయతీల్లో పల్లె ప్రగతిని పక్కాగా అమలు చేసి జాతీయస్థాయిలో ప్రభుత్వానికి గుర్తింపు రావడంలో పంచాయతీ కార్యదర్శుల పాత్రను ప్రభుత్వం విస్మరిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబం కన్నా ఉద్యోగానికే ఎక్కువ సమయం కేటాయిస్తున్నామని పేర్కొంటున్నారు. పొద్దున లేవగానే విధులకు హాజరవుతూ, రాత్రికి గానీ ఇంటికి చేరుకోలేకపోతున్నామని, అంతలా కష్టపడుతున్న తమను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదని అంటున్నారు.

పల్లెల్లో స్తంభించిన పాలన

పంచాయతీ కార్యదర్శులు సమ్మెబాట పట్టడంతో పల్లెల్లో పాలన స్తంభించింది. పన్నెండు రోజులుగా కార్యదర్శులు సమ్మెలో కొనసాగుతుండడంతో పారిశుధ్యం, ఇతర సమస్యలను పట్టించుకునేవారు కరువయ్యారు. పంచాయతీల్లో అభివృద్ధి పనులకు అప్పులు చేసి ఖర్చు చేసిన సర్పంచ్‌లు, పాలక వర్గాలు బిల్లులు రాక కష్టాల్లో ఉన్నాయి. చేతి నుంచి ఇక డబ్బులు పెట్టే పరిస్థితి లేదని చాలా గ్రామాల్లో సర్పంచ్‌లు స్పష్టం చేశారు. ఇలాంటి సమయంలో పంచాయతీ కార్యదర్శులు కూడా సమ్మెబాట పట్టడంతో పాలన స్తంభించిపోతోంది. అకాల వర్షాలతో ఎక్కడికక్కడ చెత్త, చెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతున్న పరిస్థితుల్లో ఎవరూ పట్టించుకోకపోవడం ప్రజలకు ఇబ్బందికరంగా మారింది.

విధుల్లోకి ఇరవై మంది..

సాక్షి కామారెడ్డి/నాగిరెడ్డిపేట: సమ్మెలో ఉన్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు మంగళవారం సాయంత్రంలోగా విధుల్లో చేరాలని, లేదంటే టెర్మినేట్ చేస్తామని పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్‌కుమార్ సుల్తానియా నోటీసులు జారీచేసిన విషయం విధితమే. దీంతో జిల్లాలో 20 మంది విధుల్లో చేరినట్లు పంచాయతీరాజ్ శాఖ వర్గాలు తెలిపారు. పదకొండు మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, తొమ్మిది మంది ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు మంగళవారం విధుల్లో చేరారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి టౌన్: తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న డిగ్రీ కళాశాలల్లో పార్ట్‌టైం గెస్ట్ లెక్చరర్‌గా పని చేయడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కామారెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. యూజీ స్థాయిలో ఆయా సబ్జెక్టుల్లో బోధించడానికి అర్హత, అనుభవమున్న వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సబంధిత సబ్జెక్టులో పీజీ, పీహెచ్‌డీ కలిగి ఉండి కనీస రెండేళ్ల బోధన అనుభవం ఉండాలన్నారు. కామారెడ్డి కళాశాలలో లైబ్రేరియన్ పోస్టు ఖాళీగా ఉందని దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈనెల 16వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు www.ttwrdcs.ac.inను సంప్రదించాలన్నారు.

బాన్సువాడలో భారీ వర్షం

- కొనుగోలు కేంద్రాల్లో తడిసి ముద్దయిన ధాన్యం
- పోసానిపేటలో పిడుగుపాటుకు గేదె మృతి



పోసానిపేటలో పిడుగుపడి మృతి చెందిన గేదె



బాన్సువాడలోని కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యంలో నిలిచిన వర్షపు నీటిని తొలగిస్తున్న రైతులు

బాన్సువాడ: అకాల వర్షాలు అన్నదాతకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. పదిహేను రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతన్న ఆగమగమవుతున్నాడు. మంగళవారం బాన్సువాడ ప్రాంతంలో కురిసిన వర్షానికి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పూర్తిగా తడిసిముద్దయ్యింది. ధాన్యం రాశుల్లో నిల్వ ఉన్న వర్షపు నీటిని తొలగించేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. అకాల వర్షాల కారణంగా రైతులు వారం పదిరోజుల తర్వాత కోతలు మొదలు పెట్టారు. కోత కోసిన ధాన్యాన్ని తరలించి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఆరబెట్టుకునేలోపే మళ్లీ వర్షాలు కురిసి ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సైతం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సూచించినప్పటికీ రైస్‌మిల్లర్లు కొనుగోలు చేయడం లేదు. నిర్ణీత శాతం వచ్చిన తర్వాతే కొనుగోళ్లు జరుపుతున్నారు. ధాన్యం ఆరబెట్టే పనిలో రైతులు నిమగ్నమవుతున్న నేపథ్యంలో మళ్లీ కురుస్తున్న వర్షాలకు ధాన్యం పూర్తిగా తడిసి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు వేడుకుంటున్నారు.

రామారెడ్డి మండలం పోసానిపేటలో..

రామారెడ్డి: రామారెడ్డి మండలం పోసానిపేటలో మంగళవారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. పోసానిపేటకు చెందిన రాజయ్య గేదెను మేపుతుండగా పిడుగుపడి గేదె మృతి చెందింది. ఇప్పటికే రైతు రాజయ్య వరివేసి తీవ్రనష్టాల పాలవగా, పిడుగుపాటుకు గేదె మృతి చెందడంతో కన్నీటి పర్యంతమయ్యాడు.

నిర్లక్ష్యానికి పసికందు మృతి

- గర్భంలోనే ప్రాణాలు కోల్పోయిన శిశువు
- జిల్లా ఆస్పత్రిలో బంధువుల ఆందోళన

కామారెడ్డి టౌన్: వైద్యుల నిర్లక్ష్యంతో గర్భంలోనే శిశువు మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించిన వివరాలు.. మాచారెడ్డి మండలం భవానిపేటకు చెందిన కల్పన అనే నిండు గర్భిణి పురిటి నొప్పులతో మంగళవారం ఉదయం కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి వచ్చింది. పురిటి నొప్పులు ఉన్నా వైద్యులు సాయంత్రం వరకు కాలయాపన చేశారని గర్భిణి భర్త ప్రవీణ్, బంధువులు తెలిపారు. తీరా రాత్రి పరిశీలించి బిడ్డ కడుపులోనే చనిపోయిందని తక్షణమే ఆపరేషన్ చేయాలని చెప్పారు. ఆపరేషన్ చేసి మృత శిశువుని అప్పగించారు. దీంతో బంధువులు ఆపరేషన్ థియేటర్ ముందు ఆందోళన చేపట్టారు. వైద్యులు త్వరగా ఆపరేషన్ చేసి ఉంటే శిశువు బతికి ఉండేదని.. వైద్యులు నిర్లక్ష్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌తో వాగ్వాదానికి దిగారు. ఆస్పత్రిలో విధుల్లో ఉన్న పోలీసులు వారిని సముదాయించారు.



పసికందు మృతదేహం చూసి రోధిస్తున్న బంధువులు

తెయూలో సద్దుమణిగిన వివాదం

- ఎట్టకేలకు దిగొచ్చిన వీసీ
- పాలకమండలి సభ్యుల ఒత్తిడితో క్యాంపస్‌కు రాక
- వర్సిటీ అభివృద్ధికి సహకరిస్తానన్న వీసీ
- టీచింగ్, నాన్–టీచింగ్, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి జీతాలు జమ



వీసీ రవీందర్‌ను నిలదీస్తున్న ఈసీ మెంబర్లు, విద్యార్థిసంఘాల నాయకులు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది

తెయూ (డిచ్‌పల్లి): ఇరవై రోజులుగా తెలంగాణ యూనివర్సిటీలో నెలకొన్న వివాదాలు, గందరగోళ పరిస్థితులు తాత్కాలికంగా సద్దుమణిగాయి. ఎట్టకేలకు దిగివచ్చిన వీసీ రవీందర్‌గుప్తా పాలకమండలి సభ్యులు, రిజిస్ట్రార్‌తో కలిసి వర్సిటీ అభివృద్ధికి సహకరిస్తానని అంగీకరించారు. తెయూకు రిజిస్ట్రార్ నియామకం, వీసీ అక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా రచ్చకెక్కడంతో ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ప్రభుత్వ పెద్దల సూచన మేరకు విద్యాశాఖ ఉన్నతాధికారులు, ఈసీ సభ్యులు వర్సిటీ పాలన గాడిలో పెట్టేందుకు నిర్ణయాలు తీసుకున్నారు. ఏకంగా వీసీపై ఏసీబీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు సిఫార్సు చేశారు. వీసీ నియమించిన ఇన్‌చార్జి రిజిస్ట్రార్ నిర్మలాదేవి ఈ పరిణామాలన్నీ గమనించి వెంటనే తిరిగి ఓయూలో రీజాయిన్ అయ్యారు. ఇలా అన్ని రకాల ఒత్తిళ్లతో ఉక్కిరిబిక్కిరైన వీసీ ఇప్పుడు ఈసీ చెప్పినట్లు నడుచుకుంటానని తలొగ్గాల్సి వచ్చింది.

జీతాల కోసం ఆందోళన

నాలుగు రోజులుగా అవుట్‌సోర్సింగ్ సిబ్బంది తమకు జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విధులు బహిష్కరించి ధర్నాలు చేస్తున్నారు. రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన యాదగిరి, పాలకమండలి సభ్యులను సోమవారం కలిసి తమకు జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బ్యాంకు అధికారులతో మాట్లాడానని సాయంత్రంలోపు జీతాలు పడేలా చూస్తామని రిజిస్ట్రార్, ఈసీ సభ్యులు ఉద్యోగులకు హామీ ఇచ్చారు. అయితే యాదగిరి పంపిన చెక్కులను అంగీకరించవద్దని వీసీ రవీందర్ బ్యాంకు అధికారులకు మెయిల్ పంపించారు.

వీసీని వర్సిటీకి పిలిపించిన ఈసీ సభ్యులు

మంగళవారం ఉదయం జీతాలు రాలేదని అవుట్‌సోర్సింగ్ సిబ్బంది మళ్లీ ఆందోళన చేపట్టారు. సమాచారం తెలుసుకున్న ఈసీ సభ్యులు రిజిస్ట్రార్‌తో మాట్లాడారు. వీసీ బ్యాంక్ అధికారులకు మెయిల్ చేయడంతో జీతాలు నిలిచిపోయినట్లు రిజిస్ట్రార్ ఈసీ సభ్యులకు వివరించారు. వెంటనే ఈసీ సభ్యులు వీసీకి ఫోన్‌చేసి క్యాంపస్‌కు రావాలని ఒత్తిడి తెచ్చారు. దీంతో వీసీ మధ్యాహ్నం వర్సిటీకి చేరుకున్నారు. వెంటనే ఈసీ సభ్యులు మారయ్యగౌడ్, గంగాధర్‌గౌడ్, ఎస్‌ఎల్‌శాస్త్రి, వసుంధరాదేవి, అసోసియేట్ ప్రొఫెసర్ రవీందర్‌రెడ్డిలు వీసీ చాంబర్‌కు చేరుకున్నారు. రిజిస్ట్రార్ యాదగిరిని, బ్యాంకు మేనేజర్ రవిలను వీసీ చాంబర్‌కు పిలిపించి మాట్లాడారు. బ్యాంకు ఉన్నతాధికారుల సూచన మేరకు ఉద్యోగులు, సిబ్బంది జీతాలకు సంబంధించి రిజిస్ట్రార్ యాదగిరి జారీచేసిన 12 చెక్కులను అనుమతించాలని వీసీ లేఖ రాసి అందజేశారు. రాత్రి వరకు ఉద్యోగులు, సిబ్బంది ఖాతాల్లో బ్యాంకు అధికారులు జీతాలు జమ చేశారు.

ఇద్దరు చీడపురుగులను దూరం పెట్టండి..

ఈసీ సభ్యుల సమక్షంలో అవుట్‌సోర్సింగ్ సిబ్బంది, విద్యార్థి సంఘాల నాయకులు వీసీ రవీందర్‌ను నిలదీశారు. మీరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ వర్సిటీ పరువు, ప్రతిష్టలను గంగలో కలుపుతున్నారని మండిపడ్డారు. వర్సిటీలో చదువుతున్నామని, పని చేస్తున్నామని చెప్పుకోవడానికి సిగ్గుపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్సిటీకి చెందిన ఇద్దరు చీడపురుగుల మాటలను విని మీకు ఈ దుస్థితి వచ్చిందని, ఇకమీదటైనా వారిని దూరంగా పెట్టాలని రిజిస్ట్రార్ యాదగిరి సూచించారు. గత నెల నుంచి ఈసీ సమావేశాలు జరిగిన మూడుసార్లు మీకు ముందస్తు సమాచారం ఇచ్చినా, సమాచారం లేదని అబద్ధాలు ఎందుకు చెప్పారని ప్రశ్నించారు. అలాగే తన పీహెచ్‌డీ సర్టిఫికెట్ ఫేక్ అని ఎలా చెబుతారని నిలదీశారు. అలా చెప్పడం తన తప్పేనని వీసీ అంగీకరించారు. ఇకపై ఈసీ సభ్యుల మార్గదర్శకత్వంలో రిజిస్ట్రార్‌తో కలిసి పని చేస్తానని వీసీ పేర్కొన్నారు. ఈ నెల 12న జరిగే ఈసీ సమావేశానికి హాజరువుతానని తెలిపారు.

జిల్లాకు రాష్ట్రస్థాయి ర్యాంకులు

- ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన కాకతీయ విద్యార్థులు
- ఎంపీసీలో 989 మార్కులతో 6వ ర్యాంకు


ఉమాయ అఫ్జల్

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని కాకతీయ కళాశాలకు చెందిన విద్యార్థులు మంగళవారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. కళాశాలకు చెందిన విద్యార్థినులు స్రవంతి, మరో విద్యార్థి ఉమాయ అఫ్జల్ ఎంపీసీ సెకండియర్‌లో 989/1000 మార్కులు సాధించి రాష్ట్రస్థాయి 6వ ర్యాంకులు సాధించారు. అలాగే వైష్ణవి, భవాని, చింత సంపత్ ఎంపీసీలో 988 మార్కులతో ఏడో ర్యాంకులు సాధించారు. మైత్రి, నక్షత్ర 987 మార్కులు సాధించి, 8వ ర్యాంకులు పొందారు.

బైపీసీ విభాగంలో..

రసూదఫిర్దోస్ బైపీసీ 986/1000 మార్కులు సాధించి స్టేటు 9వ ర్యాంకు సాధించారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ బైపీసీ ఫలితాల్లో టక్రీమ్ 437/440 మార్కులు సాధించి, రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకు సాధించారు. రజిక ఎంపీసీ విభాగంలో 464/470 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి 4వ ర్యాంకు సాధించారు. సబసఫిక్ సీఈసీ విభాగంలో 485/500 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ రజనీకాంత్, చైర్‌పర్సన్ విజయలక్ష్మీ సన్మానించారు.

ఎస్‌ఆర్ కళాశాలల ప్రభంజనం..

నగరంలోని ఎస్‌ఆర్ జూనియర్ కళాశాలకు ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులు వచ్చాయి. ఇంటర్ సెకెండియర్ ఎంపీసీ విభాగంలో ముత్యాల రిషిత్ 991/1000, చెన్నబోయిన శార్వానీ 991/1000 మార్కులు సాధించి రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. బైపీసీ విభాగంలో సూర్యవంశీ శీరిష 990/1000 మార్కులు సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో నల్ల నేహ 467/470, అక్షయ 467/470 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో అర్చన 436/440, జ్ఞానేశ్ 436/440 మార్కులు సాధించారు. దీంతో విద్యార్థులను కళాశాల జోనల్ ఇన్‌చార్జి గోవర్ధన్‌రెడ్డి సన్మానించారు.


రాష్ట్ర స్థాయి ర్యాంకర్లతో విజయ చిహ్నం చూపుతున్న కాకతీయ కళాశాల సిబ్బంది


నల్లా నేహా


అక్షయ


శార్వానీ


స్పందన, 465/470 (ఎంపీసీ, వెక్టర్ కళాశాల)

ఎస్ఎస్ఆర్‌కు ఉత్తమ మార్కులు..

నగరంలోని ఎస్ఎస్ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాలలో ఉత్తమ మార్కులు సాధించారు. కళాశాలకు చెందిన అమరపాలి ఇంటర్ బైపీసీ సెకండియర్‌లో 970/1000 మార్కులు సాధించారు. గౌతమి 947 మార్కులు సాధించారు. అలాగే సీహెచ్ సృజన బైపీసీలో 937మార్కులు, అక్షయ్ ఎంపీసీలో 910/1000 మార్కులు సాధించారు. ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం మొహమ్మద్ 431/470 మార్కులు సాధించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సంస్థ చైర్మన్ మారయ్యగౌడ్ అభినందించారు.


రాష్ట్ర స్థాయి ర్యాంకర్లను సన్మానిస్తున్న ఎస్ఆర్ కళాశాల జోనల్ ఇన్‌చార్జి గోవర్ధన్‌రెడ్డి

ఉషోదయ కళాశాల ప్రతిభ..


హిమవర్షిని

బోధన్‌టౌన్(బోధన్): ఇంటర్ ఫలితాల్లో బోధన్‌లోని ఉషోదయ జూనియర్ కళాశాల విద్యార్థిని హిమవర్షిని బైపీసీ సెకండియర్‌లో 992 మార్కులు సాధించింది. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థుల ను చైర్మన్ సూర్యప్రకాష్, డైరెక్టర్ ధుష్యంత్ అభినందించారు.

కొమన్‌పల్లి విద్యార్థికి పెర్కిట్(ఆర్మూర్):


బోగ వేదాన్

ఆర్మూర్ మండలం కొమన్‌పల్లికి చెందిన బోగ వేదాన్ ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో 467/470 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించాడు. హైదరాబాద్‌లోని రావిర్యాల నారాయణ బ్రాంచ్‌లో అతడు చదువుతున్నాడు. ఉత్తమ మార్కులు సాధించడంతో తల్లిదండ్రులు శ్రీనివాస్, ఉమారాణి హర్షం వ్యక్తం చేశారు.

వైద్యవృత్తిలో రాణిస్తా..



నిర్మల్ జిల్లా కుబీర్ మండలంలోని గోదాపూర్ గ్రామానికి చెందిన ప్రసాద్ సుశీల దంపతుల కుమార్తె సూర్యవంశి శిరీషా. బైపీసీ విభాగంలో 990 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ర్యాంకు సాధించానని ఆమె పేర్కొంది. ఆమె తండ్రి వ్యవసాయం చేస్తుండగా తల్లి గృహిణి. పదో తరగతి చదివి 10/10 సాధించింది. అనంతరం ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో చదివి బైపీసీలుగా భాగంలో రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించింది. తాను మంచి డాక్టర్ కావాలని ఉందని పేర్కొంది.

– శిరీషా, కుబీర్, నిర్మల్

బ్యాంక్ అధికారినవుతా..



ఇంటర్ సెకండియర్ ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో 989 మార్కులతో రాష్ట్రస్థాయి 6వ ర్యాంకు సాధించానని స్రవంతి పేర్కొన్నారు. వ్యవసాయం చేస్తూ తమ కూతురు స్రవంతిని చదివించారు. సదాశివనగర్ మండలం ఉత్తునూర్ గ్రామనికి చెందిన శ్రీనివాస్, భాగ్యలక్ష్మి దంపతులు. కుమార్తె స్రవంతి స్థానిక కాకతీయ కళాశాల నిజామాబాద్‌లో చదివింది. పదో తరగతిలో 10 జీపీఏ సాధించానని భవిష్యత్‌లో బ్యాంక్ అధికారి కావాలని కోరుకుంటున్నానన్నారు.

– స్రవంతి, ఉత్తనూర్, సదాశివనగర్

డాక్టర్‌గా సేవలందిస్తా..



నగరంలో ఆటోనగర్‌కు చెందిన ఉమైమ టక్రీమ్ తండ్రి దుబాయ్‌లో ఉంటాడు. తల్లి షహానా షంజుమా గృహిణి. వీరి కూతురైన ఉమైమ టక్రీమ్ ఇంటర్ ఫస్టియర్‌లో 437 మార్కులు సాధించి రాష్ట్రస్థాయి మొదటి స్థానంలో నిలిచానన్నారు. పదోతరగతి భైంసాలో చదివి 9.8 జీపీఏ సాధించారు. అనంతరం కాకతీయ కళాశాలలో ఇంటర్ చదివి రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించారు. భవిష్యత్‌లో ఉత్తమ డాక్టర్‌గా సేవలందిస్తానన్నారు.

– ఉమైమా టక్రీమ్, ఆటోనగర్, నిజామాబాద్

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవుతా..



ఇంటర్ సెకండియర్‌లో ఎంపీసీ విభాగంలో 991 మార్కులు సాధించిన ముత్యాల రిషిత సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలని లక్ష్యంతో చదివింది. రిషిత పదో తరగతిలో 10/10 సాధించింది. అనంతరం నగరంలోని ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివింది. రిషిత తండ్రి రామకృష్ణారెడ్డి ప్రైవేట్ కళాశాలలో లెక్చరర్. తల్లి శ్వేత ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పని చేస్తోంది. వీరు జిల్లా కేంద్రంలోని గంగస్థాన్–2లో నివాసం ఉంటున్నారు.

– ముత్యాల రిషిత, గంగస్థాన్–2

సీసీ కెమెరాలతో సామాజిక భద్రత

- ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్
- రెంజల్‌లో సీసీకెమెరాల ప్రారంభం



రెంజల్ మండలకేంద్రంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్

రెంజల్(బోధన్): సీసీ కెమెరాల ఏర్పాటుతో సామా జిక భద్రత పెరుగుతుందని ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్ అన్నారు. రెంజల్‌లో గ్రామాభివృద్ధి కమిటీ ద్వార ఏర్పాటు చేసిన 24 సీసీ కెమెరాలను మంగళవారం ఆయన గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రారంభించారు. అనంతరం రైతువేదికలో ఏర్పా టు చేసిన సమావేశంలో ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. సీసీ కెమెరాలు వచ్చిన తర్వాత నేరాలు చాలావరకు తగ్గుతున్నాయన్నారు. సీసీ కెమెరాలు ఉన్నాయంటే వాటిని చూసి భయాందోళన దొంగల్లో ఏర్పడుతుందన్నారు. ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పోలీసు వ్యవస్థలో వస్తున్న మార్పులు కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగమన్నారు. సీఎం కేసీఆర్ రూ.వెయ్యి కోట్లతో హైదరాబాద్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం ద్వార నేరాలను త్వరితగతిన గుర్తించి కేసులను చేధిస్తున్నట్లు వివరించారు. సర్పంచ్ మర్ల రమేశ్ కుమార్, బోధన్ ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐ శ్రీనివాస్‌రాజ్, మాజీ ఎంపీటీసీ లోలపు కిషోర్, ఎస్సై సాయన్నలతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

రుద్రూర్ : మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వారి ఆరోగ్య సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి సుదర్శనం సూచించారు. రుద్రూర్ మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఆరోగ్య మ హిళ పథకం అమలు తీరును మంగళవారం ఆయన ప రిశీలించారు. వైద్యులతో మాట్లాడి పథకంలో భాగంగా అందిస్తున్న చికిత్స వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో సుదర్శనం మాట్లాడుతూ జిల్లా లోని రాకాసీపేట్, సీతారాంనగర్ కాలనీ, ఆర్మూర్ అర్బన్ హెల్త్ సెంటర్లలో, రుద్రూర్, మెండోరా పీహెచ్‌సీ ల్లో ఆరోగ్య మహిళ పథకం అమలులో ఉందన్నారు. ఈ పథకంలో భాగంగా ప్రతి మంగళవారం మహిళలకు ప్ర త్యేకంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వడంతో పాటు అవసరమైన వారికి జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేస్తారన్నారు. పథకం ప్రారంభమైన తొమ్మిది వారాల్లో జిల్లాలోని ఐదు కేంద్రాల్లో 4,246 ఓపీ నమోదు కాగా 2,541 మందికి పరీక్షలు నిర్వహించామన్నారు. బ్రెస్ట్ క్యాన్సర్ తదితర పరీక్షలను 2,773 మందికి, 879 మందికి గర్భసంచి పరీక్షలు నిర్వహించి, 8 మందిని జిల్లా ఆ స్పత్రికి రిఫర్ చేశామన్నారు. ఇవే కాకుండా పోషకాహారలోపం, థైరాయిడ్, యూరిన్ ఇన్ఫెక్షన్ తదితర పరీక్ష లు నిర్వహించి అవసరమైన చికిత్స, మందులు అందచేస్తున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు మండల వైద్యాధికారిణి అయేషా సిద్దిఖీ, హెల్త్ సిబ్బంది ఉన్నారు. ఈ సందర్భంగా రుద్రూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా వైద్యాధికారిని మండలంలోని ఆశవర్కర్లు కలిసి తమ సమస్యలు విన్నవించారు. తమ పనికి తగ్గ వేతనం ఇప్పించాలని కోరారు.


రుద్రూర్ పీహెచ్‌సీలో మహిళలతో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి సుదర్శనం

రక్తమోడిన రహదారి

- సీఎంసీ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- రెండు బైక్‌లను ఢీకొన్న కంటెయినర్
- తల్లీ బిడ్డలు, మరొకరు మృతి


ఘటనాస్థలిలో పోగుల శ్యాం, నవ్య


రాజన్న మృతదేహం




గోపిడి రాజన్న, పోగుల నవ్య, సమన్వి (ఫైల్)

డిచ్‌పల్లి/మోపాల్ : డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి శివారు సీఎంసీ కళాశాల సమీపంలో 44వ జాతీయ నంబర్ రహదారిపై మంగళవారం జ రిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. డిచ్‌పల్లి సీఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మోపాల్ మండలం కులాస్‌పూర్ గ్రామానికి చెందిన పోగుల శ్యాం, భార్య నవ్య (32), ఇద్దరు పిల్లలు రుషి, సమన్వి (6) కలిసి వేల్పూర్ మండలం రామన్నపేట్‌లోని బంధువుల ఇంటికి బైక్‌పై బయల్దేరారు. వీరు డిచ్‌పల్లి మండలం సీఎంసీ వద్దకు చేరుకోగానే వెనక నుంచి అతివేగంగా వచ్చిన కంటెయినర్ బైక్‌ను ఢీకొట్టింది. అదేసమయంలో దుబ్బాక నుంచి డిచ్‌పల్లి వైపు వస్తున్న గూపన్‌పల్లికి చెందిన గోపిడి రాజన్న(55) బైక్‌ను కూడా కంటెయినర్ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన రాజన్న అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడ్డ శ్యాం, నవ్య, పిల్లలు రుషి, సమన్విలను హైవే అంబులెన్స్‌లో చికిత్స కోసం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. మార్గమధ్యలోనే నవ్య, సమన్వి మృతిచెందారు. శ్యాంను కుటుంబీకులు ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. పోగుల శ్యాం పదిరోజుల క్రితమే గల్ఫ్ నుంచి స్వగ్రామానికి వచ్చాడు. బంధువులను కలిసేందుకు రామన్నపేట్‌కు కుటుంబంతో కలిసి బయల్దేరాడు. రోడ్డు ప్రమాదం భార్య, కూతురును కబళించింది. శ్యాంతోపాటు కుమారుడు రుషి పరి స్థితి విషమంగానే ఉంది. కుటుంబీకులు, బంధువులు జిల్లా కేంద్రాసుపత్రికి చేరుకున్నారు. చనిపోయిన నవ్య, చిన్నారి సమన్వి మృతదేహాలను చూసి కన్నీరుమున్నీరయ్యారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన రాజన్న ధర్పల్లి మండలం దుబ్బాక గ్రామంలో బంధువులు జరుపుకున్న బీరప్ప పండుగకు హాజరయ్యాడు. తిరిగి వస్తుండగా ప్రమాదానికి గుర య్యాడు. రాజన్నకు భార్య లక్ష్మీ, కొడుకు, కూతురు ఉన్నారు.

జేపీఎస్‌ల డిమాండ్లు పరిష్కరించాలి

సుభాష్‌నగర్: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ భూపతి రెడ్డి డిమాండ్‌చేశారు. నగరంలోని ధర్నా చౌక్‌లో జేపీఎస్‌లు చేపట్టిన సమ్మెకు మంగళవారం భూపతి రెడ్డి మద్దతు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సాక్షాత్తు అసెంబ్లీలో ప్రకటించిన మేరకు వెంటనే జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయాలన్నారు. సమ్మె చేస్తున్న జేపీఎస్‌లను విధుల్లో చేరాలని, లేకుంటే తొలగిస్తామని ప్రకటించడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు.

బీజేపీ సంపూర్ణ మద్దతు

నగరంలోని ధర్నా చౌక్‌లో జేపీఎస్‌లు చేపట్టిన సమ్మెకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు దినేష్ కులాచారి, ప్రొఫెసర్ విద్యాసాగర్‌రావు, డిచ్‌పల్లి ఎంపీపీ గద్దె భూమన్న మద్దతు తెలిపారు. వారిని రెగ్యులర్ చేసే వరకూ బీజేపీ అండగా ఉంటుందని తెలిపారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి

15నుంచి సీఎం కేసీఆర్ కప్ టోర్నమెంట్

- మండల, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో పోటీల నిర్వహణ
- విజేతలకు నగదు బహుమతులు

నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులలో ఉన్న ప్రతిభను వెలికి తీయాలనే ఉద్దేశంతో ఈనెల 15 నుంచి సీఎం కేసీఆర్ కప్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల అధికారి ముత్తెన్న ఒక ప్రకటనలో తెలిపారు. 15సంవత్సరాల నుంచి 36సంవత్సరాల లోపు ఉన్న వారు పోటీల్లో పాల్గొనలన్నారు.

మండల స్థాయి పోటీలను ఈ నెల 15నుంచి 17వరకు నిర్వహించాలన్నారు. మండల స్థాయి విజేతల జట్లకు ఈనెల 22నుంచి 24వరకు జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు. జిల్లాస్థాయి విజేతలుగా నిలిచిన జట్టుకు ఈనెల 28నుంచి 31వరకు రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మండలస్థాయిలో..

అథ్లెటిక్స్(లాంగ్‌జంప్, షాట్‌పుట్), కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్ పోటీలు ఉంటాయన్నారు. ఎంపీపీ చైర్మన్‌గా, జెడ్పీటీసీ సభ్యులుగా, ఎంపీడీఓ కన్వీనర్‌గా, తహసీల్దార్, ఎస్సై, ఎంఈవో, పీడీ, పీఈటీ, మున్సిపల్ కమిషనర్‌లుగా సభ్యులుగా ఉంటారు.

జిల్లాస్థాయిలో..

జిల్లాస్థాయిలో అదనంగా నిర్వహించే క్రీడలకు సంబంధించి నేరుగా పోటీలకు రావాలన్నారు. అథ్లెటిక్స్ (లాంగ్‌జంప్, షాట్‌పుట్), బాడ్మింటన్, బాస్కెట్ బాల్, హ్యాండ్ బాల్, స్విమ్మింగ్, కుస్తీ, బాక్సింగ్ పోటీలు ఉంటాయన్నారు. జిల్లాస్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా, సీపీ వైస్‌చైర్మన్, జిల్లా అదనపు కలెక్టర్ కో వైస్ చైర్మన్‌గా, జిల్లా క్రీడల అధికారి కన్వీనర్‌గా, డీఈఓ, జిల్లా పరిశ్రమల అధికారి ప్రెసిడెంట్, జిల్లా ఒలింపిక్ సంఘం, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సభ్యులుగా ఉంటారు.

రాష్ట్రస్థాయిలో..

రాష్ట్రస్థాయిలో అదనంగా నిర్వహించే క్రీడలకు సంబంధించి నేరుగా పోటీలకు రావాలన్నారు. ఇందులో ఆర్చరీ, జిమ్నాస్టిక్స్, లాన్ టెన్నిస్, షూటింగ్, టేబుల్ టెన్నిస్ (మహిళలు – పురుషులకు) హాకీ, వెయిట్ లిఫ్టింగ్ (పురుషుల)కు మాత్రమే ఉంటుందన్నారు.

బహుమతులు ఇలా..

వ్యక్తిగత క్రీడల్లో విజేతలకు రూ. 20వేలు, ద్వితీయ స్థానంలో రూ. 15వేలు, తృతీయస్థానంలో రూ. 10వేల నగదు బహుమతులు ప్రదానం చేయనున్నారు. విజేత జట్టుకు రూ. 1లక్ష, ద్వితీయ రూ. 75వేలు, తృతీయ రూ. 50వేల నగదుతో పాటు బహుమతులు అందజేస్తారు.

క్లుప్తంగా

స్టార్టర్ డబ్బాలో పాము



రామారెడ్డి: మండలంలోని ఇసన్నపల్లి గ్రామంలో ఓ రైతు తన పొలంలోని స్టార్టర్ బాక్స్‌ను తెరచి చూడగా పాము ప్రత్యక్షమైంది. వివరాలు ఇలా.. ఇసనపల్లి గ్రామానికి చెందిన రెడ్డిపేట బాలయ్య మంగళవారం తన పొలానికి వెళ్లాడు. అనంతరం స్టార్టర్ బాక్స్‌ను బంద్ చేయడానికి తెరచి చూడగా.. అందులో నాగుపాము దాగి ఉంది. డబ్బా లోపల ఫీజుల చుట్టూ పాము తిరిగి పడుకుంది. దీంతో పామును బయటకు తీయడానికి రైతు నానా అవస్థలు పడి చివరికి బయటకు రప్పించారు. మండలంలో చాలామంది రైతులకు ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయి.

ఇంటర్‌లో ఫెయిలైన విద్యార్థి అదృశ్యం

ఖలీల్ వాడి: నగరంలోని 4వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వినాయక్ నగర్‌కు చెందిన పిట్టల శ్రీనివాస్(17) అనే ఇంటర్ విద్యార్థి అదృశ్యం అయినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. మంగళవారం ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాలు రావడంతో శ్రీనివాస్ ఫెయిల్ అయ్యాడు. దీంతో అతడు హైదరాబాద్ వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి, బయలుదేరాడు. ఆ తర్వాత అతడి ఆచూకీ లభించకపోవడంతో బాలుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

క్రైం కార్నర్

ఇంటర్ ఫస్టియర్ విద్యార్థి ఆత్మహత్య


మోర ప్రజ్వల్ (ఫైల్)

ఆర్మూర్ టౌన్ : ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్ష ఫలితాల్లో ఫెయిల్ కావడంతో నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణానికి చెందిన విద్యార్థి మోర ప్రజ్వల్ ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణంలోని శాస్త్రి నగర్‌లో నివసించే ఆర్ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ కుమారుడైన ప్రజ్వల్ హైదరాబాద్‌లోని మాదాపూర్ నారాయణ కాలేజీలో బైపీసీ చదివాడు. మంగళవారం పరీక్ష ఫలితాలు రాగా మూడు సబ్జెక్టులలో ఫెయిలయ్యాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై ఒంటరిగా ఉన్న ప్రజ్వల్ ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. తండ్రి కుమారుడికి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో క్లినిక్‌లోనే పనిచేస్తున్న నర్సును చూసి రమ్మని ఇంటికి పంపించాడు. ఆమె తిరిగొచ్చి లేదని చెప్పింది. తర్వాత లక్ష్మణ్ భార్యతో కలిసి వెళ్లి పై అంతస్తులోకి వెళ్లి చూడగా ప్రజ్వల్ ఉరివేసుకుని కనిపించాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి సోదరి విశాఖ పట్టణంలో ఎంబీబీఎస్ పూర్తిచేసి గీతం యూనివర్సిటీలో పీజీ చేస్తోంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబు తెలిపారు.

అనారోగ్య కారణంతో ఒకరు..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలకేంద్రంలో ఓ వ్యక్తి అనారోగ్యం కారణంగా ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రాజేశ్ తెలిపిన వివరాలు ఇలా... మండల కేంద్రానికి చెందిన చిట్టిపు వీరయ్య(58) మూడేళ్లుగా ఆస్తమాతో బాధ పడుతున్నాడు. ఆస్పత్రిల్లో చూయించిన నయం కాలేదు. గత ఆరు నెలల నుంచి దగ్గు, దమ్ము ఎక్కువయింది. దీంతో మంగళవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనస్థలానికి వచ్చి, వివరాలు సేకరించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాజేశ్ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

బాల్కొండ: మండల కేంద్రంలోని ఊరచెరువులో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి శవం లభ్యమైంది. మృతుడి వయస్సు సుమారు 50–55ఏళ్ల మధ్య ఉంటుందని ఏఎస్సై రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఒంటిపై చొక్కలేదన్నారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని బాల్కొండ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

చెరువులో పడి ఒకరి మృతి

డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ మండలం నికాల్‌పూర్ గ్రామంలోని చెరువులో ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి పడి చెందాడు. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన మహ్మద్ రసూల్(47) సోమవారం ఉదయం జంగం చెరువు కట్ట కింద ఉన్న తన పొలంలో వరికోత పనికి వెళ్లి, తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చెరువు కట్ట వద్ద వెతకగా నీటిలో పడి మృతిచెంది కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. చెరువు వద్ద కాళ్లు, చేతులు కడిగే సమయంలో జారీ నీటిలో పడి పోయినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడి భార్య హైమది బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సైతెలిపారు.

చికిత్స పొందుతూ బాలుడు..

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని నర్సిరోడ్డులో ఆదివారం ఎమ్మెల్యే అనుచరుల వాహనం ఢీకొని తీవ్రగాయాల పాలైన అజ్జ దీపక్ తేజ(12) సోమవారం రాత్రి మృతి చెందాడు. మొదట బాలుడికి నిజామాబాద్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తుండగా.. మెరుగైన చికిత్స నిమిత్తం సోమవారం రాత్రి హైదరాబాద్‌కు తరలిస్తుండడగా మార్గమధ్యలో మృతి చెందాడు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

మృతుడి బంధువుల ఆందోళన..

మృతి చెందిన బాలుడి కుటుంబాన్ని ఆదుకోవాలని మృతుడి బంధువులు ఆస్పత్రి ఎదుట రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. బాలుడి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆమేర్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.


దీపక్‌తేజ మృతదేహం వద్ద రోధిస్తున్న బంధువులు

సిలిండర్ లీకేజీతో ఇల్లు దగ్ధం

డొంకేశ్వర్(ఆర్మూర్): మండలం కేంద్రంలో మంగళవారం గ్యాస్ సిలిండర్ లీకై ఇల్లు దగ్ధమైంది. ప్రమాదవశాత్తు జరిగిన ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. సుమారు రూ.50వేల వరకు ఆస్తి నష్టం వాటిల్లింది. వివరాలు ఇలా.. పూసవర్ల దేవ్, గురువయ్య మండలకేంద్రంలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. సోమవారం రాత్రి నీళ్ల వేడి చేయడానికి గ్యాస్ సిలిండర్‌ను స్టార్ట్ చేయగా ఒక్కసారిగా మంటలు ఎగిసి పడ్డాయి. ఇంటి నుంచి బయటకు వచ్చి కేకలు వేయడంతో చుట్టుపక్కన ఉన్నవారంతా వచ్చి కాలిపోతున్న ఇళ్లపై నీళ్లు చల్లారు. మంటలు వేగంగా వ్యాపించడంతో ఇల్లు పూర్తిగా కాలిపోయింది. సర్పంచ్ చాయచందు, ఆర్ఐ రాజేశ్వర్‌లు ఘటన స్థలానికి వచ్చి పంచనామా చేశారు. కూలీపని చేసుకునే బాధితులకు డబుల్ బెడ్‌రూంతో పాటు నష్టపరిహారం అందేలా చూస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు.


కాలిపోయిన ఇంటి వద్ద బాధితులు

వివాహేతర సంబంధాన్ని ప్రశ్నించినందుకే హత్యాయత్నం

- పోలీసుల అదుపులో నిందితుడు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ కిరణ్‌కుమార్



ఖలీల్‌వాడి: తన భార్యతో వివాహేతర సంబంధంపై ప్రశ్నించినందుకు భర్తపై భార్య ప్రియుడు హత్యకు యత్నించినట్లు ఏసీపీ కిరణ్‌కుమార్ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. నగరంలోని ఏసీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. నగరానికి చెందిన సయ్యద్ షహీన్, సయ్యద్ షకీల్ భార్యాభర్తలు. వీరికి కుమారుడు సోయబ్ ఉన్నాడు. షహీన్‌తో సయ్యద్ షఫివుల్లా హుస్సేన్‌కు వివాహేతర సంబంధం ఉంది. ఈ విషయం భర్తకు తెలియడంతో, ఈనెల 8న ప్రియుడు హుస్సేన్ బయట మాట్లాడుకుందామని షకీల్‌ను, అతడి కొడుకు సోయబ్‌ను ఎల్లమ్మగుట్ట సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లాడు. అనంతరం హుస్సేన్ తన అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని షకీల్‌ను పెద్ద బండరాయితో తలపై కొట్టి గాయపరచి, బీర్ సీసా పగులగొట్టి హత్యకు యత్నించాడు. దీంతో సోయబ్ అడ్డుపడగా, అతడిని సైతం చంపుతానని బెదిరించగా బయపడి పారిపోయాడు. వెంటనే హుస్సేన్ కూడా పారిపోయాడు. స్థానికులు గాయపడిన షకీల్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సోయబ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు. నిందితుడుని పట్టుకొని, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సిబ్బంది వెంకట నారాయణ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.